పురంలో భౌ.. భౌ

హిందూపురం పట్టణంలోని టీచర్స్‌కాలనీలో వారం క్రితం ఆరుబయట ఆడుకుంటున్న నాలుగేళ్ల మోక్షిత అనే చిన్నారిపై వీధికుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో చిన్నారి చేతికి, కడుపు వద్ద తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన చిన్నారిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. కుక్కల నియంత్రణను పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు.



హిందూపురం పట్టణంలోని త్యాగరాజనగర్ ప్రాంతంలో తాసిన్ అనే యువతి వాహనంలో వెళ్తుండగా కుక్కలు వెంటపడ్డాయి. భయంతో అతి వేగంగా వాహనం నడపడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలైంది. ఇలా రోజూ పట్టణంలో ఏదో ఒక ప్రాంతంలో కుక్కల దాడులు జరుగుతునే ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు.



- రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు
- మూడు నెలల్లో 20 మందికి పైగా గాయాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఆందోళనలో ప్రజలు



ఓ వీధిలో గుంపుగా ఉన్న కుక్కలు

హిందూపురం: పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నడిచి వెళ్లినా, బండిపై వెళ్లినా వెంటపడుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలోని ఏ వీధిలో చూసిన శునకాలు గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. వీధులతో పాటు హోటళ్లు, చికెన్, మటన్ దుకాణాల వద్ద తిష్ట వేస్తూ అటు వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. పరిగి రోడ్డు, మోత్కుకుపల్లి రోడ్డు, గర్ల్స్ ఏరియా, ముక్కిడిపేట, బోయపేట, టీచర్స్‌కాలనీ, మెయిన్ రోడ్డు, శ్రీకంఠపురం, ఆర్టీసీ కాలనీ, రహమత్‌పురం ఏరియా, రైల్వేస్టేషన్, త్యాగరాజనగర్ ఇలా అక్కడా ఇక్కడా అని తేడా లేకుండా అన్నిచోట్లా వీధి సింహాలు గుర్రుమంటున్నాయి. కుక్కల బెడద ఎక్కువగా అవడంతో స్థానికులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కళాశాలలు, స్కూళ్లకు వెళ్తున్న చిన్నారులు, విద్యార్థులు, వివిధ పనులపై బయటకు వెళ్లే వృద్ధులు రోడ్డు ఎక్కాలంటేనే ఆందోళన చెందాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే వాహనాల వెంట పరుగులు తీస్తుండంతో కుక్కల బారి నుంచి తప్పించుకునే క్రమంలో చాలా మంది అదుపుతప్పి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

'పురం'లో 2,200 శునకాలు

హిందూపురం పట్టణంలో 39 వార్డులు ఉన్నాయి. 2,200కు పైగా శునకాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గత మూడు నెలల్లో 20 మందికిపై వివిధ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నారు. కుక్కల సంఖ్యను తగ్గించడంలో మాత్రం మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారని అన్ని వర్గాల ప్రజలు విమర్శిస్తున్నారు.

చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నాయి



టీచర్స్ కాలనీ వీధిలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. చిన్న పిల్లలు బడికి, షాపుకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇప్పటికే చాలామంది కుక్కల దాడిలో గాయాలపాలయ్యారు. పలుసార్లు మున్సిపల్ ఆఫీసులో ఫిర్యాదు కూడా చేశాము. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

– సడ్లపల్లె చిదంబరరెడ్డి, టీచర్స్‌కాలనీ

రోడ్డెక్కాలంటేనే భయంగా ఉంది



పట్టణంలో ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులుగా కనిపిస్తున్నాయి. అసలు రోడ్డు ఎక్కాలంటేనే భయం భయంగా ఉంది. శునకాల నియంత్రణకు అవసరమయ్యే చర్యలు తీసుకోవడం లేదు. వాటి సంఖ్య పెరిగిపోతుండటంతో మరిన్ని కష్టాలు తప్పేలాలేవు. చిన్నారులు, వృద్ధులు, మహిళలను దృష్టిలో ఉంచుకొని వెంటనే మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సిద్ధిక్, హిందూపురం

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం



పట్టణంలో కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా వాటిని పట్టుకొని సంతాన వృద్ధి కాకుండా వెటర్నరీ వైద్యులచే ఆపరేషన్లు చేయించడం, యాంటీ బయాటిక్ వ్యాక్సినేషన్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. గతంలో కుక్కలకు పట్టి ఆపరేషన్లు చేయించాం. ఈ మధ్య ప్రజలపై దాడి చేస్తున్న ఘటనలు మా దృష్టికి వచ్చాయి. కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

చంద్రబాబు దళితులకు క్షమాపణ చెప్పాలి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. చిత్తూరు జిల్లాలో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లాలోనే అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులే అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారన్నారు. ఆ ఘటనకు చంద్రబాబే పూర్తి బాధ్యత వహించాలని కోరారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన టీడీపీ నాయకులపై ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో కూటమి ప్రభుత్వం టీడీపీ నాయకులను కాపాడడానికి ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ఇలాంటి ఘటనల్లోనూ కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ దోషులను రక్షించడానికి ప్రయత్నించడం సహించరాని విషయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహాలకు పలుచోట్ల అవమానాలు జరిగినా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే ఈ ప్రభుత్వంలో దళితులకు ఏమాత్రం రక్షణ లేదన్నారు. దళితులపై అనేక దాడులు జరిగినా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. చంద్రబాబు దళిత వ్యతిరేకిగా మారారన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనలో చంద్రబాబు దళితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే దళితులు కూటమి ప్రభుత్వానికి ఎదురు తిరగడం ఖాయమని హెచ్చరించారు.

సీఈసీ సభ్యుడికి సన్మానం



వైటీని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డిని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు నరసింహ, నాయకులు లక్ష్మీనారాయణ, బాబు తదితరులు వైటీని సన్మానించారు. వైటీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు.

క్రికెట్ టోర్నీ విజేత 'ఫియర్ లెస్'

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో దసరా పండుగా సందర్భంగా పంచాయతీ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పవర్ స్ట్రైకర్స్ జట్టుపై ఫియర్ లెస్ జట్టు గెలుపొందింది. విన్నర్స్, రన్నర్స్ జట్లకు బహుమతులు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి నివాళి



చంద్రప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: మండల పరిధిలోని మందలపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యురాలు నాగమ్మ భర్త చంద్రప్ప (65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులతో కలిసి మందలపల్లికి చేరుకుని చంద్రప్ప మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ మండలంలోని మంచి నాయకుడిని కోల్పోయామన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. మృతుడు చంద్రప్పకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈరలక్కప్ప వెంట మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, సర్పంచులు కరుణాకర్‌గౌడు, రంగస్వామి, జగదాంబ క్రిష్టప్ప, తిప్పేస్వామి, హనుమంతరాయప్ప, అశ్వత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం

అగళి: మండల పరిధిలోని నరసంబుదిలో వెలసిన రంగనాథస్వామి జాతర ఆదివారం కనుల పండువగా సాగింది. శరన్నవరాత్రి ఉత్సవాల అనంతరం ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తూ వస్తున్న ఈ ఉత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వేకువ జామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంలో కొలువుదీర్చి ఊరేగించారు. మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు.



అలంకరణలో రంగనాథస్వామి ఉత్సవ విగ్రహం



జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

సమష్టిగా పనిచేయండి



మాట్లాడుతున్న వేణురెడ్డి

లేపాక్షి: రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి సూచించారు. మండలంలోని బసవనపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు హరీష్ నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నాయకులతో సమావేశమయ్యారు. సమష్టిగా పనిచేస్తే విజయం సులువుగా వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నిస్సార్, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్యామప్రసాదరెడ్డి, తిప్పన్న, నరసింహులు, రామక్రిష్టారెడ్డి, వెంకటేష్, శ్రీరామిరెడ్డి, బాలక్రిష్ణ, అన్సార్, చందు, లచ్చి, మద్దిలేటి, వసంత్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగ్ ఎక్కడిచ్చినా పని చేసేందుకు సిద్ధంగా ఉండాలి



సూచనలిస్తున్న మానిటరింగ్ అధికారి వెంకటేశ్వర్లు

హిందూపురం టౌన్: నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయులు ఎక్కడకు వేసినా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని శిక్షణా కార్యక్రమం మానిటరింగ్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. బీఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో డీఎస్సీలో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని మానిటరింగ్ అధికారి వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. తెలుగు, హిందీ శిక్షణ తరగతుల్లో భాషకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధ్యాయులను దేవుడిలాగా పూజిస్తారని, అవకాశం వస్తే అక్కడ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీఎంఓ మాలిక్, ఎంఈఓలు గంగప్ప, శేషాచలం, ప్రసన్నలక్ష్మీ, ఆర్పీలు బాబా, నర్సిరెడ్డి, రాజు, నాగమణి పాల్గొన్నారు.

వైభవం.. వీరభద్రుడి రథోత్సవం

అగళి: మండల పరిధిలోని మధూడి లో వీరభద్ర స్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం స్వామివార్ల ఉత్సవ మూర్తులను రథంపై కొలువుదీర్చి భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథాన్ని లాగారు. మన రాష్ట్రంతో పాటు సమీప కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో గ్రామం మొత్తం సందడిగా మారింది. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.





వీరభద్రస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, అలంకరణలో వీరభద్రస్వామి ఉత్సవ మూర్తి

అ'పూర్వ' సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2001–02 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఘనంగా గురువందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన పూర్వ విద్యార్థులతో పాటు నాటి గురువులతో కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. పాత జ్ఞాపకాలను అందరూ నెమరవేసుకున్నారు. ఆ తర్వాత పూర్వ విద్యార్థులు నాటి గురువులను శాలువ కప్పి పూలమలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గురువులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వాల్మీకి విగ్రహావిష్కరణ



వాల్మీకి చిత్రపటానికి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో పావగడ – పెనుకొండ ప్రధాన రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహావిష్కరణను సోమవారం చేయనున్నట్లు వాల్మీకి సాంఘిక, ఆర్థికాభివృద్ధి సంఘం నాయకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు విగ్రహావిష్కరణ, సాయంత్రం వెండి పల్లకీలో ఊరేగింపు ఉంటుందన్నారు. 7న అభిషేకం, జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

నేడు నీలకంఠాపురానికి మాజీ డీజీపీ రాక

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఉదయం 9 గంటలకు స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు స్వర్గీయ ఎన్ శ్రీరామరెడ్డి 120వ జయంతి వేడుకలను మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా కేరళ రాష్ట్రానికి చెందిన మాజీ డీజీపీ బీ సయ్యద్ మహమ్మద్ యాసిన్ హాజరుకానున్నారు. క్రికెట్ టోర్నీలో విజేతలకు, అలాగే పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు, ఉత్తమ రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు.

రేపు మండల మీట్

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి తెలిపారు. మూడు నెలలకోసారి ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని సూచించారు. అధికారులు గైర్హాజరైతే చర్యలు చేపడతామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రొళ్ల: మండల పరిధిలోని కొడగార్లగుట్ట కాలనీ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కొడగార్లగుట్ట కాలనీకి చెందిన రామప్ప తన పొలం వద్దకు 544ఈ జాతీయ రహదారి గుండా నడిచి వెళుతున్నాడు. అదే సమయంలో రొళ్ల వైపు నుంచి మడకశిర వైపు వేగంగా వచ్చిన కారు రామప్పను ఢీకొట్టింది. ఈ ఘటనలో రామప్ప ముఖం, తల, కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 1033 హైవే అంబులెన్స్ సహాయంతో రొళ్ల సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ప్రస్తుతం రామప్ప ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. కారు నడుపుతున్న వ్యక్తి ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు.

చిత్రలింగేశ్వరస్వామికి క్షీరాభిషేకం



రొళ్ల మండలం జీజీ హట్టి నుంచి గోవు పాలతో తరలివెళ్తున్న అర్చకులు

రొళ్ల: యాదవల ఆరాధ్యం దైవం చిత్రలింగేశ్వరస్వామికి అర్చకుల బృందం అత్యంత భక్తిశ్రద్ధలతో క్షీరాభిషేకం చేసింది. ఆదివారం గంతికల్లు గొల్లహట్టి గ్రామానికి చెందిన యాదవ కులస్తులు యత్తప్ప స్వామి పేరు మీదా ఊరి పొలిమేరలో వదిలిన ఆవుల నుంచి పాలను సేకరించారు. అనంతరం 46 కిలో మీటర్ల దూరంలోని అమరాపురం మండలం సరిహద్దు కర్ణాటక ప్రాంతం యరగుంట – లక్కనహళ్లి సమీపం వద్ద ఉన్న చిత్రలింగేశ్వరస్వామి పోళి వద్దకు చేరుకున్నారు. తర్వాత స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు క్షీరాభిషేకం చేశారు. ఇలా చేయడం ద్వారా గ్రామాల్లోని ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారని భక్తుల నమ్మకం.

నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

అగళి: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని నాయకులు, అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయలని కోరారు.

సెల్‌ఫోన్ చోరీ

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లి కొత్తపల్లి క్రాస్ వద్ద నివాసముంటున్న కెనరా బ్యాంకు అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ మహేష్ ఇంట్లో ఆదివారం సెల్‌ఫోన్ చోరీ జరిగింది. దొంగ ఇంట్లోకి చొరబడి బయట గదిలో టేబుల్‌పైన ఉన్న ఐఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ టీవీ ఫుటేజీని కూడా పోలీసులు అందించారు.

సాదర సంఘం కల్యాణ మండపానికి భూమి పూజ



శిలాఫలక ఆవిష్కరణలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తదితరులు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో హిందూ సాదర సంఘం ఆధ్వర్యంలో కల్యాణ మండపం (ఫంక్షన్ హాల్) నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విచ్చేశారు. హిందూ సాదర సంఘం మండల నేతలు సమక్షంలో తొలుత కల్యాణ మండప నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమాలను చేపట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎం లింగణ్ణ విద్యా సంస్థల అధినేత సేవామందిరం సంస్థ అధ్యక్షుడు కేటీ శ్రీధర్, పుర ప్రముఖులు, సాదర సంఘం నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు, నేరస్తులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

మడకశిర: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం మండలంలోని రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో నేరస్తులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ నగేష్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో జీవించాలని, నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. కదలికలపై నిఘా ఉంచుతామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధర్నాకు మద్దతు

పెనుకొండ: ఫ్యాప్టో చేపట్టిన ధర్నాకు ఏపీ ఎస్టీఏ మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 7న ఫ్యాప్టో ధర్నా చేపట్టిందని, దానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం రాగానే పెండింగ్ బకాయిలన్నీ చెల్లిస్తామని, మంచి ఫిట్మెంట్‌తో పీఆర్‌సీ ఇస్తామని, మధ్యంతర భృతి ప్రకటిస్తామని కూటమి ప్రభుత్వం పేర్కొందన్నారు. అయితే అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

గోరంట్ల: స్థానిక పులేరు రోడ్డు పక్కన వ్యభిచారం నిర్వహిస్తున్న కేంద్రంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురు వ్యభిచారం చేస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సీఐ బోయ శేఖర్ తెలిపారు. అరెస్టు చేసిన వారిలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నట్లు పేర్కొన్నారు.

అన్నదానం

హిందూపురం: పట్టణంలోని మోత్కుపల్లి 21వ వార్డులో ఆదివారం హరిహర సుధా మహా గణపతి సేవా సమితి సభ్యులు అన్నదానం చేశారు. ఆర్ఆర్ఎస్ శాఖ ఆధ్వర్యంలో వినాయక ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఆలయాభివృద్ధి, సేవా కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో అశోక్, ప్రకాష్, దివాకర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



సమావేశంలో పాల్గొన్న స్వయం సేవకులు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలోని సరస్వతి విద్యామందిరంలో ఆదివారం సాయంత్రం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. వక్తలు రామంజనేయులు, డాక్టర్ తిప్పేస్వామి మాట్లాడుతూ దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వేడుకను జరుపుకుంటున్నామన్నారు. 45 లక్షల మంది స్వయం సేవకులు దేశం కోసం పని చేస్తున్నారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సంచాలకులు నాగభూషణ, లింగేష్, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.